
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 జనగామ
శుక్రవారం 9 ఆగస్టు 2024





అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

పల్లెలకు మళ్లీ



ఎన్నికళ

'పంచాయతీ' పోరుకు కసరత్తు ముమ్మరం

ఓటరు జాబితా తయారీకి ఆదేశాలు

ఎంపీడీవోలు, ఎంపీవోలకు ఒకరోజు శిక్షణ పూర్తి

జనగామ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నగారా మోగనుంది. స్థానిక ఎన్నికల నిర్వహణపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కసరత్తు సైతం ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణలో ప్రధానమైన వార్డుల విభజనపై ప్రభుత్వం మొదటగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇటీవల జిల్లా ప్రాజెక్టు మేనేజరు, కంప్యూటర్ ఆపరేటర్లకు హైదరాబాద్‌లో శిక్షణ కూడా పూర్తి అయింది. కాగా.. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో జిల్లాలోని ఎంపీడీవో, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ ఇచ్చారు.

పార్లమెంట్ ఓటరు జాబితా ఆధారంగా..

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను అందించాలని ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాసింది. ఎన్నికల సంఘం నుంచి నియోజకవర్గం, మండలాలు, గ్రామాల వారీగా ఓటరు జాబితా రాగానే వార్డుల వారీగా విభజన చేయాలని నిర్ణయించింది. వార్డుల విభజనకు సంబంధించి పాటించాల్సిన మార్గదర్శకాలపై మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఒకే కుటుంబం అంతా ఒకే వార్డు పరిధిలో ఉండేలా విభజన చేయాలని ప్రధానంగా ప్రభుత్వం ఆదేశించింది. గత ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలో ఓటర్లు రెండు, మూడు వార్డుల్లో ఉండడం, కొన్ని చోట్ల ఇతర గ్రామాల్లోనూ ఓటరుగా నమోదు అయి ఉండడం లాంటివి ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఒక కుటుంబానికి చెందిన ఓటర్లను అంతా ఒక వార్డు పరిధిలోకే వచ్చేలా విభజన చేయనున్నారు. ఈ క్రమంలో రెండు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకొని జాబితా తయారు చేయా లని సూచించా రు. ఓటరు లిస్ట్‌లో కుటుంబ సభ్యులం తా ఒకే వరుస క్రమంలో ఉండేలా చూసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందు కోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఆ సాఫ్ట్‌వేర్ ద్వారా వార్డుల విభజన చేయనున్నారు. కాగా.. వార్డుల విభజనకు ప్రభుత్వం ఎలాంటి గడువు విధించలేదు.

మూడు విడతలుగా ఎన్నికలు..

గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచి ఎన్నికలను మూడు విడతలుగా ప్రభుత్వం నిర్వహించనుంది. ఒకే సారి ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది సరిపడకపోవ డంతో మూడు విడతలుగా ఎన్నికలను నిర్వహిస్తుంటారు. జిల్లాలో 281 గ్రామ పంచాయతీలు, 2564 వార్డులకు ఎన్నికలు జరుగు తాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది కేటాయింపుపై ఎన్నికల సంఘం గతంలోనే మార్గద ర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం.. ఒక్కో వార్డుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయను న్నారు. ఓటర్ల ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారులను కేటాయించనున్నారు. 200 ఓట్ల లోపు ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, 200-400 ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 650 పైన ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. 650 ఓట్లు పైన ఉన్న గ్రామాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం గత ఏడాది డిసెంబరులో సూచించింది.

వార్డుల వారీగా జాబితా తయారు చేయాలి: కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా గ్రామంలోని వార్డుల వారీగా ఓటరు జాబితాలు తయారు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పంచాయతీ ఎన్నికల కసరత్తులో భాగంగా కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు వార్డుల విభజనపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో నివేదిక తయారు చేయాలని సూచించారు. ఒక కుటుంబ మంతా ఒకే వార్డులో ఉండేలా జాబితాలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్‌డీవో వసంత, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, ఏవో రవీందర్, మాస్టర్ ట్రైనీలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

మండలాల వారీగా గ్రామాలు, వార్డుల వివరాలు

మండలం	గ్రామాలు	వార్డులు
బచ్చన్నపేట	26	238
చిల్పూరు	17	168
దేవరుప్పుల	32	274
స్టేషన్‌ఘన్‌పూర్	18	188
జనగామ	21	198
కొడకండ్ల	21	190
లింగాలఘనపురం	21	196
నర్మెట్ట	17	148
పాలకుర్తి	36	324
రఘునాథపల్లి	36	320
తరిగొప్పుల	15	126
జఫర్‌ఘడ్	21	194
మొత్తం	281	2564

ఫిబ్రవరి 1తో పదవీకాలం పూర్తి

- 2024 ఫిబ్రవరి 1తో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదవీకాలం పూర్తి అయ్యే లోపే ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుంది. 2019 జనవరిలో నెలలో జనగామ జిల్లాలోని పంచాయతీలకు ఎన్నికలు జరగగా ఐదేళ్ల తర్వాత సరిగ్గా అదే జనవరి లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ.. అసెంబ్లీ ఎన్నికలు, కొత్త ప్రభుత్వం కావడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ సాధ్యం కాలేదు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో మరింత ఆలస్యం అయింది. కాగా.. ఎన్నికల నిర్వహణకు

» మిగతా 8వ పేజీలో...

అవినీతి, అక్రమాలకు తావివ్వొద్దు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, ఆగస్టు 8 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో భాగంగా అవినీతి, అక్రమాలకు తావివ్వొద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కార్యకర్తలకు సూచించారు. చిలుపూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో గురువారం నిర్వహించిన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 58 మంది లబ్ధిదారులకు రూ.17,16000ల విలువ గల చెక్కులను అందజేశారు. అంతకు ముందు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటి నీళ్ళు పోశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 15లోగా రూ 2 లక్షల రుణమాఫీ చేయబోతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, ఎంపీడీవో బర్మావత్ శంకర్, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు వంగాల జగన్మోహన్‌రెడ్డి, భూక్యా స్వామినాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, బొమ్మిశెట్టి బాలరాజు, గజ్జెల దామోదర్, పేరాల సుధాకర్, మామిడాల లింగారెడ్డి, ఏదునూరి రవిందర్, రంగు రమేష్, ఎడవెల్లి మల్లారెడ్డి, ఎమ్డీ షకీల్, భూక్యా సుధాకర్‌నాయక్, ఎమ్డీ రఫీ, గడ్డమీది వెంకటస్వామి, రత్నాకర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఏపీవో మోహన్‌రావు పాల్గొన్నారు.

విద్యా ప్రవేశ్ మూల్యాంకన సర్వే పూర్తి

- జిల్లా విద్యాధికారి రాము



హరిజనవాడ స్కూల్‌లో విద్యార్థులతో డీఈవో కె.రాము

జనగామ కల్చరల్, ఆగస్టు 8: విద్యాప్రవేశ్ మూల్యాంకన సర్వే గురువారంతో పూర్తయినట్లు జనగామ డీఈవో కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1వ తరగతి చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, అవగాహన స్థాయి, సామాజిక, మానసిక ఎదుగుదల సహా పాఠ్యాంశాల్లో వారి నైపుణ్యాలను తెలుసుకోవడానికి జాతీయ వ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రాథమిక పాఠశాలల్లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అధ్యయనం ముగిసిందన్నారు. జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో మొదటి రోజు వెంకిర్యాల, రెండవ రోజు పెంబర్తి, మూడో రోజు జనగామ జిల్లా కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలల్లో ఈ సమగ్ర సర్వే చేశామన్నారు. ఈ సర్వే ద్వారా నూతనంగా బడిలో చేరిన 5 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు వివిధ అంతర్గత నైపుణ్యాలను తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. తద్వారా వారి స్థాయికి అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. వారి ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. గత 3 రోజులుగా సర్వేను స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ హుమా కయూన్ ద్వారా సర్వే పత్రాలను ఢిల్లీకి పంపించడం జరుగుతుందని డీఈవో వివరించారు. సర్వే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా ఉపాధ్యాయులు నవీన్, అనిల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డల అరిగోస

అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గ్రామాలు

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

వివరాలు 7లో

తేలుకాటు బాధ తాళలేక కూలీ ఆత్మహత్య



దాసరి యాదగిరి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 8: తేలుకాటు మంటను తాళలేక మండలంలోని కోమటిగూడెం గ్రామానికి చెందిన దాసరి యాదగిరి (55) అనే వ్యవసాయకూలీ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తెల్లవారుజామునా చోటు చేసుకుంది. గ్రామస్తు లు తెలిపిన వివరాల ప్రకారం యాదగిరి ప్రతీ రోజు మాదిరిగా బుధవారం వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ కట్టెలు కొట్టే క్రమంలో ఎర్రతేలు కాటు వేసింది. దీంతో మంట తలెత్త డంతో స్థానికంగా బాధితుడికి నాటు వైద్యం చేయడంతో ఉపశమనం కలిగింది. సాయంత్రం సమయం వరకు మరోసారి తీవ్రమంట రావడంతో తీవ్రతను మరిచిపోవడానికి గాను మద్యం సేవించాడు. రాత్రి 11గంటల సమయంలో తేలుకాటు మంట తీవ్రతరం కావడంతో చేసేది ఏమీ లేక ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందును సేవించాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు అర్ధరాత్రి సమయంలో బాధితుడిని ఆటోలో జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లుతున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. చేసేది ఏమీలేక యాదగిరి మృతదేహాన్ని తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. సంబంధిత విషయమై సీఐ జి.వేణును వివరణ కోరగా స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదు రాలే దని వివరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన యాదగిరి అంత్యక్రియల ను గ్రామస్థులు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించి గురువారం సాయంత్రం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్‌నాయక్ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందించి ఔదార్యాన్ని చాటారు.

తల్లిపాలతో శిశువుకు రోగనిరోధక శక్తి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



అన్నప్రాశన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, ఆగస్టు 8: తల్లిపాలతో శిశువుకు రోగనిరోదక శక్తి లభిస్తుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు నెలల తరువాత పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధాహారం మొదలు పెట్టవచ్చని తెలిపారు. గర్భిణీస్త్రీలు తీసుకునే ఆహారం లో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, గింజ ధాన్యాలు తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో డీబ్ల్యూఓ జె.జయంతి, సీడీపీవో రమాదేవి, ఏసీడీపీవో సత్యవతి, జనగామ అర్బన్ సూపర్‌వైజర్ పూర్ణిమ, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, తల్లులు, ఆయాలు పాల్గొన్నారు.

జనగామ సీఐ, ఎస్సైలపై బదిలీ వేటు



బదిలీ అయిన సీఐ రఘుపతిరెడ్డి



నూతన సీఐగా దామోదర్‌రెడ్డి

న్యాయవాద దంపతులపై దాడి ఘటనలో సీపీ చర్యలు

జనగామ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద దంపతులపై దాడి ఘటన వివాదంలో జనగామ సీఐ, ఎస్సైపై బదిలీ వేటు పడింది. సీఐ రఘుపతిరెడ్డి ఎస్సై తిరుపతితో పాటు కానిస్టేబుల్ బి.కరుణాకర్‌పై బదిలీ వేటు వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 5న జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు విషయంలో వెళ్లిన తమపై సీఐ రఘుపతిరెడ్డి ఆదేశంతో ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ బి.కరుణాకర్, మరికొందరు కానిస్టేబుళ్లు దాడి చేశారంటూ జనగామకు చెందిన న్యాయవాద దంపతులు గద్దల అమృతరావు, కవిత అదే రోజు ఫిర్యాదు చేశారు. న్యాయవాద దంపతులపై దాడిని ఖండిస్తూ జనగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు సైతం నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో రంగంలోకి దిగిన డీసీపీ రాజమహేంద్రనాయక్ న్యాయవాదులతో బుధవారం చర్చలు జరిపారు. న్యాయవాదులపై దాడి చేసిన సీఐ, ఎస్సై కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసే వరకు ఆందోళనలు విరమించేది లేదని న్యాయవాదులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో న్యాయవాదుల ఆందోళలను చల్లార్చేందుకు గానూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ, ఎస్సైపై కేసు నమోదు చేశారు. అయినప్పటికీ న్యాయవాదులు శాంతించలేదు. సస్పెండ్ చేసే వరకు నిరసన కార్యక్రమాలు ఆపబోమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో జనగామ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను విచారణ అధికారిగా నియమించారు. విచారణ అనంతరం సీఐ రఘపతిరెడ్డి, ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ బి. కరుణాకర్‌పై బదిలీ వేటు వేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతిని సీపీ కార్యాలయానికి అటాచ్ చేయగా కానిస్టేబుల్ కరుణాకర్‌ను ఏఆర్ విభాగానికి అటాచ్ చేశారు. కాగా.. జనగామ నూతన సీఐగా సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న దామోదర్‌రెడ్డిని జనగామ సీఐగా బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ సీఐగా రఘుపతిరెడ్డి ఫిబ్రవరి 8న బాధ్యతలు స్వీకరించారు.

న్యాయవాద దంపతులపైనా కేసు

పోలీస్ స్టేషన్‌లో దురుసుగా ప్రవర్తించారంటూ నమోదు

పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్సై పట్ల దురుసుగా ప్రవర్తించారంటూ న్యాయవాద దంపతులు గద్దల అమృతరావు, కవితపై జనగామ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6న కేసు నమోదు కాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామకు చెందిన అమృతరావు, కవిత దంపతులు ఈనెల 5న తమ క్లయింట్ అయిన ఓ వృద్ధురాలి కేసు విషయంపై మాట్లాడేందుకు జనగామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో తమపై పోలీసులు దాడి చేశారని ఆరోపిస్తూ డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు న్యాయవాద దంపతులు అదే రోజు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు మూడు రోజులుగా రాస్తారోకో, ర్యాలీలు, దీక్షలు నిర్వహించారు. తమపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, బాధ్యులైన సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతిపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దీంతో బుధవారం రాత్రి సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతిపై కేసు నమోదైంది. కేసు నమోదు చేయడంతో పాటు విచారణ అధికారిగా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను డీసీపీ రాజమహేంద్రనాయక్ నియమించారు. కాగా... పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారని, అనుచిత వ్యాఖ్యలు చేశారని న్యాయవాద దంపతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. విధుల్లో ఉన్న సీఐని ఏకవచనంతో, బెదిరించే ధోరణితో మాట్లాడారంటూ ఆ సమయంలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ సిరాజుద్దీన్ ఫరీద్ ఫిర్యాదు చేశారు. సీఐ, ఎస్సై విధులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్సై రాజేశ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

అస్థిర పరిస్థితుల్లోనే కమ్యూనిస్టు పార్టీల అభివృద్ధి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

జనగామ కల్చరల్, ఆగస్టు 8: దేశంలో బూర్జువా పార్టీలు అవలంభిస్తున్న ఆశ్రిత ఖర్చుతో రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీల పెరుగుదలకు మంచి అవకాశాలు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన సీపీఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. బూర్జువా పార్టీలు ప్రజల ఆస్తిని దోచుకొని తనకు అనుకూల సంపన్నులైన కార్పొరేటు శక్తులకు అందిస్తున్నారన్నారు. దేశ సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా పార్లమెంటులో బిల్లులు పాస్ చేయించుకుంటున్న బీజేపీ నేతలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. నేడు ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ, దేశంలో ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు, బీహార్ నితీష్‌కుమార్ అనే రెండు కర్రలపై ఆధారపడి పాలన సాగిస్తున్నారన్నారు. విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడం చూస్తుంటే ఎలాంటి పక్షపాత వైఖరి మోదీ అనుసరిస్తున్నారో దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. మోదీ తప్పుడు విధానాల వల్ల కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతిని అనేక సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కేసీఆర్ నియంతృత్వ రాజరిక పాలనకు ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడినా బీఆర్ఎస్ నాయకులు ఏమాత్రం ఆత్మవిమర్శ చేసుకోలేకపోతున్నారన్నారు పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తించి గ్రామాలకు వెళ్లి ప్రజల్లో మమేకమై వారి కష్ట సుఖాల్లో భాగం పంచుకుంటూ వారిని చైతన్యపరిచి పోరాటాలకు తీసుకురావడం ద్వారా కమ్యూనిస్టు పార్టీలు బాగా అభివృద్ధి చెందుతాయన్నారు.

ఈ సమావేశంలో సీహెచ్.రాజారెడ్డి, రాంరెడ్డి, పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, మంగళంపల్లి జనార్దన్, సొప్పరి సోమయ్య, రావుల సదానందం, జువారి రమేష్, పాతూరి ప్రశాంత్, జీడి ఎల్లయ్య, పైసా రాములు, భువనగిరి కుమారస్వామి, నీల కనకయ్య, సముద్రాల రాజు, బంటు పాండు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

కేయూ పాలక మండలి కీలక నిర్ణయం

హైదరాబాద్‌లో ఇన్‌చార్జ్ వీసీ కరుణ ఆధ్వర్యంలో సమావేశం

తప్పుడు సమాచారమిచ్చిన డీన్లు, హెచ్‌వోడీలపై మండిపాటు

పకడ్బందీగా వర్సిటీ ప్రహరీ నిర్మాణం

వీసీ సర్చ్ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు

7లో



కేయూ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న వీసీ వాకాటి కరుణ

శ్రావణమాసం సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో డిస్కౌంట్

- జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ స్వాతి

జనగామ రూరల్, ఆగస్టు 8: శ్రావణమాసం సందర్భంగా జనగామ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి డిస్కౌంట్ ఇస్తున్నట్లు జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ స్వాతి గురవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శ్రావణమాసం మాసంలో వివాహలు, ఇతర శుభకార్యాలు ఉండడంతో ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నాయన్నారు. ప్రయాణికులకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అద్దె బస్సులు కావాలనుకునే వారికి చార్జీల్లో 10 శాతం డిస్కౌంట్ ఇస్తునట్లు తెలిపారు. ఈ అవకాశం సెప్టెంబర్ 3 వరకు ఉంటుందన్నారు. ఇతర వివరాలు, బుకింగ్ కొరకు 73828 52818 నెంబర్లను సంప్రదించగలరని తెలిపారు.

వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం

- ఏ జిల్లాకు ఎవరు డీఎంహెచ్‌వోనో తెలియని వైనం
- వరంగల్ జిల్లాలో ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జూలై 8: ఉమ్మడి వరంగల్ వైద్య, ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన బదిలీలు గందరగోళానికి దారితీస్తున్నాయి. వైద్యాధికారులు బదిలీ అయిన స్థానాలకు వెళ్లకుండా పాత స్థానంలోనే ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్ర వైద్య సంచాలకుల కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన బదిలీలు, పోస్టింగులపై పలువురు వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బదిలీలపై నిషేధం విధించినప్పటికీ పాత తేదీలపై ఉత్తర్వులు వెలువడుతూనే ఉన్నాయి.

డీఎంహెచ్‌వో ఎవరు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు జిల్లాల్లో అసలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎవరనేది అయోమయంగా ఉంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా పని చేసిన డాక్టర్ బి.సాంబశివరావు వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇంతవరకు మూమెంట్ ఆర్డర్ రాకపోవడంతో ఆయన హనుమకొండలోనే పనిచేస్తున్నారు. ఇక హనుమకొండకు రావాల్సిన ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మూమెంట్ ఆర్డర్ రావడం లేదని ఇంకా ములుగులోనే కొనసాగుతున్నారు. ఇక కరీంనగర్‌కు వెళ్లాల్సి ఉన్న డాక్టర్ వెంకటరమణ ఇదే సాకుతో వరంగల్‌లోనే కొనసాగుతున్నారు.

ఒకే పోస్టులో ఇద్దరు

గత నెల 27న సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సదానందంను బదిలీ చేసి ఆయనస్థానంలో హనుమకొండ జిల్లాకు చెందిన ఎం.హనుమానాయక్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు విడుదల చేశారు. ఈ మేరకు హనుమనాయక్‌ను సంగెం పీహెచ్‌సీ వైద్యాధికారి విధుల్లో చేర్చుకున్నారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ.. ఈ నెల 8న మరో లేఖ విడుదలైంది. బదిలీ అయిన సదానందంను మళ్లీ అదేస్థానానికి పోస్టింగ్ ఇస్తూ గత నెల 31వ తేదీన ఉత్తర్వులు విడుదల చేసినట్లు అందులో ఉంది. కాగా, ఇంత హైటెక్ సమాజంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు లేఖ వచ్చేందుకు 8 రోజులు పడుతుందా..? అని ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులను నియమించడం వైద్య, ఆరోగ్యశాఖకే చెల్లుతుందని విమర్శిస్తున్నారు. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం అధికారుల తీరు వల్లనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖలో జరిగిన బదిలీలపై జ్యుడీషియల్ విచారణ కొనసాగిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని ఉద్యోగులు అంటున్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న లయన్ క్లబ్ ప్రతినిధులు

వ్యక్తిత్వ నిర్మాణానికి 'లయన్ క్వెస్ట్' దోహదం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: విద్యార్థుల్లో వ్యక్తిత్వ నిర్మాణానికి లయన్‌క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి అన్నారు. గురువారం ఉర్సుగుట్ట వద్ద ఉన్న ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ సారథ్యంలో ఉపాధ్యాయులకు లయన్ క్వెస్ట్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సక్రమ మార్గంలో నడిచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనేక జనాభా ఉన్న మన దేశంలో లయన్స్ క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. గౌరవ అతిథి, క్వెస్ట్ ప్రోగ్రామ్ ప్రాజెక్టు మేనేజర్ లయన్ శివప్రసాద్ మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంజేపీ ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న ప్రతీ విషయాన్ని విద్యార్థుల్లో మానవతా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడేలా వారికి నేర్పించాలన్నారు. ఎంజేపీ ఆర్‌సీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుతున్న ఈపాఠశాలల్లో వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఇలాంటి క్వెస్ట్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం గత ఏడాది ఎంజేపీ కళాశాలల్లో ర్యాంకులు సాధించిన 14 మంది విద్యార్థులను అతిథుల చేతుల మీదుగా సన్మానం చేశారు. శిక్షణ కార్యక్రమానికి శిక్షకురాలుగా కొండపల్లి రేణుక వ్యవహరించగా కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ కందుకూరు వెంకట్‌రెడ్డి, ఫస్ట్ డిప్యూటీ గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ప్రోగ్రాం అసిస్టెంట్ కోఆర్డినేటర్ లయన్ పరికిపండ్ల వేణు, లయన్ డాక్టర్ రాజలక్ష్మి, లయన్ మార్గం ప్రభాకర్, లయన్ రవీందర్‌రెడ్డితో పాటు 37 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిస్టరీలో వసంతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ విశ్వవిద్యాలయం హిస్టరీ విభాగం పరిశోధకురాలు ఇటికాల వసంత డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి వసంతకు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలుగు ప్రాంతంలో మాతంగి సంస్కృతి- ఒక పరిశీలన' అనే అంశంపై కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ పర్యవేక్షణలో వసంత పరిశోధన పూర్తి చేశారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామానికి చెందిన వసంత అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వసంతను పలువురు అభినందించారు.



అడవిబిడ్డల అరిగోస

● అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గ్రామాలు ● నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 8: అడవులే ఆదెరువుగా.. పాశ్చాత్య సంస్కృతి, జీవన విధానానికి దాసోహం కాని కట్టుబాట్లతో.. ప్రకృతినే దేవతలుగా కొలుస్తూ.. శ్రమైక జీవనమే తమ తరగని సౌందర్యమని నిరూపిస్తూ.. ఆత్మగౌరవమే తరగని ఆస్తిగా జీవిస్తున్నారు అడవిబిడ్డలు. ప్రపంచ పోకడల్లో ఎన్ని పెనుమార్పులు వచ్చినా తమ సంస్కృతీ, సంప్రదాయాలు చెక్కు చెదరవని, వనదేవతలు సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తి, యోధుడు కొమురంభీం తెగువను చాటుతూ తమ అస్థిత్వాన్ని, మనుగడను చెక్కు చెదరనివ్వడం లేదు ఆదివాసీలు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకమైన చట్టాలు, హక్కుల సాధనకు ప్రభుత్వాలు, పాలకులతో అలుపెరగని పోరును నేటికీ కొనసాగిస్తూనే.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. తమ తలరాతలు మారడం లేదంటూ జల్.. జంగల్.. జమీన్ నినాదాన్ని ముందుకు తీసుకుపోతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు నడుం బిగిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకు అందకపోతుండటంతో వారు నేటికీ అభివృద్ధిలో వెనుకబడే ఉన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల బతుకుచిత్రంపై ప్రత్యేక కథనం.

హక్కులు, చట్టాల అమలుకు నిరంతరం పోరాటమే..

మన రాజ్యాంగం ఆదివాసులకు ప్రత్యేకమైన, పటిష్టమైన హక్కులు, చట్టాలను కల్పించినా అవి సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు 1/70 చట్టం రక్షణ కవచమే అయినా ఆ చట్టం అమలు ఆశాజనంగా లేదంటూ ఆదివాసులు ఆవేదన చెందుతున్నారు. 1959లో భారత ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనుల భూములు, ఆస్తులను గిరిజనేతరులు కొనకూడదని చట్టాన్ని తీసుకువచ్చి దీన్ని 1963నుంచి అమలు చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల భూములను గిరిజనేతరులు కొనడానికి, అమ్మడానికి వీలు లేదని స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పెసా చట్టానికి పూర్తి అధికారులున్నాయి. 5, 6వ షెడ్యూల్‌లో పెసా గ్రామ సభ ద్వారానే ప్రభుత్వ పథకాల అమలు జరగాలి. గ్రామసభ తీర్మానం లేనిదే ఎలాంటి పనులు చేయడానికి వీలు లేదు. కానీ ఆ పెసా చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని, పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆదివాసీ సంఘాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ చట్టం సరిగా అమలు జరిగితే ఆదివాసీగూడేలు అభివృద్ధిపథంలోకి వెళ్లడమే కాకుండా ఆదివాసీ సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఆదివాసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. 5వ, 6వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు భారత రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే అధికారాలు ఇచ్చినా ఆ పరిస్థితులు ఏజెన్సీలో లేకుండా పోయాయి.

గిరిపల్లెలకు ఐటీడీఏ అండ.. సత్ఫలితాలిస్తోందా?

ఆదివాసీ పల్లెలకు ఐటీడీఏ అండగా నిలుస్తోంది. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏల ఏర్పాటుతో ఆదివాసీల పల్లెలకు జీవం పోసినట్లయింది. కానీ అనుకున్నంతా లక్ష్యాలకు ఆమడదూరంలోనే ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న అనుకున్నంతా లక్ష్యాలను చేరుకోవడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 5.30లక్షల మంది ఆదివాసీలు ఉన్నారు. 1986లో ఏటూరునాగారంలో ఐటీడీఏను నెలకొల్పారు. ఐటీడీఏ పరిధిలో మొత్తం 13ఏజెన్సీ మండలాలకు విస్తరించి ఉంది. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఐటీడీఏ పెద్ద దిక్కుగా ఉంటుంది. కానీ ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా అనుకున్న లక్ష్యాలను మాత్రం చేరుకోలేదు. గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సంక్షేమం తదితర శాఖలు మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. గిరిజనులకు ఇప్పటికీ రోడ్ల సౌకర్యం లేని గ్రామాల్లో ఎన్నో ఉన్నాయి.

జీవన విధానం, పండుగలు అంతా వైవిధ్యమే

ఆదివాసీల జీవనవిధానం, పండుగలు వైవిధ్యంగా ఉంటాయి. రాష్ట్రంలో మొత్తం తొమ్మిది ఆదివాసీ తెగలున్నాయి. అంధ్, భిల్, చెంచుతో చెంచువారు, గోండ్ (నాయక్‌పోడ్, రాజ్ గోండ్, కొండరెడ్లు, కొలామ్ (మన్నెవార్లు), కోయ (బినే కోయ, రాజ్ కోయ, పర్ధాన్, తోటి వంటి తెగలు కలవు. గోండ్ ఆదివాసీ తెగ నాగోబా జాతర, జంగుబాయి పండుగను ప్రధానంగా జరుపుకుంటారు. అంధ్ తెగ వారు పూలాజీ బాబా జయంతి, సిరాల్ పండుగను జరుపు కుంటారు. కొలామ్ తెగ వారు భీమా నాయక్ జాతర, నాయక్‌పోడ్ గాంధారి మైసమ్మ జాతర, లక్ష్మీ దేవర పండుగను జరుపుకొంటారు. చెంచులు భౌరాపూర్ జాతర, సలేశ్వరం జాతర, లొద్ది జాతర, కోయలు సమ్మక్క-సారలమ్మ జాతరలను జరుపుకొంటారు. దీంతో పాటు ఆదివాసీలు పెద్దల పండుగ, భూమి పండుగ, ఇప్పపూల పండుగ, చిక్కుడు కాయ, గోంగూర, మొక్కజొన్న పండుగలే కాక కోయ తెగలలో ఇంటి పేరుతో గల ఇలవేల్పుల పండుగలు జరుపుకుంటారు.

ఆదివాసీ దినోత్సవ నేపథ్యం

ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు రక్షణకు ప్రపంచ దేశాలు నడుం కట్టి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1982 ఆగస్టు 9వ తేదీన 26మందితో స్వతంత్ర మానవ హక్కుల నిపుణులతో వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. తదనంతరం 1994లో యూఎన్‌వో జనరల్ అసెంబ్లీ కమిటీ సమావేశమైన రోజునే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ప్రతీ యేటా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతోంది.

ఐటీడీఏలను బలోపేతం చేయాలి

కబ్బాక శ్రావణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏలను ప్రభుత్వం బలోపేతం చేయాలి. గిరిజన గ్రామాలు నేటికీ నిరాధరణకు గురవుతున్నాయి. గిరిజన అభివృద్ధికి బడ్జెట్‌లో లెక్కలు చూపుతున్నా అవి కాగితాలకే పరిమితమవతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీల బతుకులు మారడం లేదు. ఐటీడీఏలను ప్రభుత్వాలు గాలికొదిశాయి. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు పటిష్ఠంగా అమలు చేయాలి.

నేడు కేయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ఆగస్టు 9న శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహిస్తామని ఆదివాసీ విద్యార్థి సంఘం కేయూ నేతలు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరల్ ర్యాలీ, పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, విశిష్ట అతిథులుగా ములుగు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతిరావు, వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు, హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, రిటైర్డు అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొరలు పాల్గొని మాట్లాడుతారని వెల్లడించారు.

హైకోర్టు ఏజీపీగా రూహీ నబీల నియామకం



వరంగల్ లీగల్, ఆగస్టు 8: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా (ఏజీపీ)న్యాయవాది రూహీ నబీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రకటన వెలువరించింది. హనుమకొండ అడ్వకేట్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన రూహీ నబీల 2016లో న్యాయవాదిగా నమోదు చేసుకొని కొంతకాలం వరంగల్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం హైకోర్టులో తన ప్రాక్టీస్ ప్రారంభించారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. తన తండ్రి సీనియర్ న్యాయవాది మహ్మద్ మైమూద్ వద్ద న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియామకం కావడం పట్ల హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, న్యాయవాదులు ఆనంద్‌మోహన్, జంగా స్వప్న, రమాదేవి, నరేందర్, రహెమాన్, అండాళ్ తదితరులు అభి నందనలు తెలిపారు.

మహిళా పాలిటెక్నిక్‌లో 12న స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: వరంగల్ నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ కమర్షియల్ ప్రాక్టీస్ (సీసీపీ) మూడు సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.రామప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 12వ తేదీన స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

కేయూ పాలక మండలి కీలక నిర్ణయం ● వీసీ సర్చ్ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు



హైదరాబాద్ సచివాలయంలో సమావేశమైన కేయూ పాలక మండలి సభ్యులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించేందుకు కేయూ అత్యున్నత పాలక మండలి పచ్చజెండా ఊపి ఆమోదముద్ర వేసింది. వర్సిటీ పీహెచ్‌డీ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని నిర్ణయించారు. దీంతో వర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులకు న్యాయం జరగనుంది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ నేతృత్వంలో కేయూ కొత్త పాలకమండలి తొలి సమావేశం జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ నవీన్, సామాజిక వేత్త పుల్లూరి సుధాకర్, డాక్టర్ చిర్ర రాజు, ఏఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమారి, సామాజిక వేత్త చౌహన్, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్యలు పాల్గొన్నారు.

తొలి పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు క్యాంపస్‌లోని వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంపై దాడి చేయడం, తదనంతరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విద్యార్థులను కొట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా కేయూ పీహెచ్‌డీల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో వర్సిటీలోని అన్ని విభాగాల్లో నూతనంగా విద్యార్థులకు యూజీసీ నిబంధనలు, విద్యార్థుల మెరిట్ మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే వర్సిటీ అధికారులతో అంతర్గతంగా పీహెచ్‌డీ అడ్మిషన్లపై సమగ్రంగా చర్చించి విధి విధానాలు రూపొందించి విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే విద్యార్థులు నష్టపోయారని, తొందరగా ఒకటి, రెండు రోజుల్లోనే పీహెచ్‌డీ అడ్మిషన్లపై తుది నిర్ణయం తీసుకుని అడ్మిషన్లు చేపట్టాలని పాలక మండలి సభ్యులు నిర్ణయించారు. వర్సిటీలో వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలపై పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చారని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ మండిపడినట్లు తెలిసింది. వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చిన డీన్లు, హెచ్‌ఓడీలపై ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయకూడదని కరుణ అన్నట్లు సమాచారం. అలాగే వర్సిటీ క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం పాలక మండలి సభ్యులు తీవ్రంగా చర్చించారు. ప్రహరీ నిర్మాణంలో క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. వర్సిటీ భూమి ఇంచు కూడా కబ్జాకు గురికాకుండా సర్వే ప్రకారం 100శాతం రక్షించాలని నిర్ణయించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కాకుండా చిత్తశుద్ధితో భూములను రక్షించాలని సమావేశంలో నిర్ణయించారు.

కాగా, వర్సిటీ క్యాంపస్ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బ్లాక్ ఆఫ్ లేని సీసీ కెమెరాలను ఆధునీకరించాలని, డేటా బ్యాకప్ ఎక్కువగా ఉండేలా చూడాలని నిర్ణయించారు. అలాగే నూతనంగా వర్సిటీలో మూడు హాస్టళ్లలో డైనింగ్ హాళ్లు నిర్మించాలని, హాస్టళ్లకు అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు అనుమతి ఇచ్చారు. అలాగే పార్టుటైమ్, అకడమిక్ కన్సల్టెన్స్‌గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు పాలక మండలి సమావేశం తీపి కబురును నింపింది. వర్సిటీలో మొత్తంగా పార్టుటైమ్, కన్సల్టెన్స్ అధ్యాపకుల్లో వర్సిటీ శాంక్షన్ పోస్టుల్లో పనిచేస్తున్న అధ్యాపకులను అప్‌గ్రేడ్ చేసి కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించాలని నిర్ణయించారు. అయితే శాంక్షన్ బడ్జెట్ పోస్టులు, ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఎంత మేర బడ్జెట్ అవసరమవుతుందో చూడాలని, వారి వివరాలను తీసుకుని దాదాపుగా 40 మందిని కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పాలక మండలి సిఫార్సు చేసింది. కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ అయితే నెల నెలా జీతం వచ్చి అధ్యాపకుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటారని పాలకమండలి సభ్యులు సిఫార్సు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తుది నిర్ణయం వెలువరించనుంది. నాన్ బడ్జెట్ పోస్టులు, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పూర్తి వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల విషయంలో తుది నిర్ణయం తీసుకోలేదు.

వీసీ కోసం..

రాష్ట్రప్రభుత్వం అన్ని వర్సిటీలకు కొత్త వైస్‌చాన్స్‌లర్లను నియమించనున్న నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీకి ఈసీ నామినీగా ఒక్కరిని ఎంపిక చేయాల్సి ఉంది. దీని కోసం ముగ్గురు అనుభవజ్ఞులైన మాజీ వైస్ చాన్స్‌లర్లను పేర్లను ఈసీ సిఫార్సు చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా గురువారం పాలక మండలి ముగ్గురిని ఎంపిక చేశారు. అయితే వీరిలో ఒక్కరిని ఖరారు చేయాల్సి ఉంది. సోమవారం మరోదఫా పాలక మండలి సభ్యులు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో సమావేశమై ఈసీ నామినీగా ముగ్గురిలో ఒక్కరిని సిఫార్సు చేయనున్నారు.

రిజిస్ట్రేషన్లపై కొత్త అధికారుల కొర్రీలు

● నిబంధనల పేరిట ఇబ్బందులు ● 2,500కు పైగా పెండింగ్‌లో మ్యుటేషన్ సర్టిఫికెట్లు

రాంనగర్, ఆగస్టు 8: నూతన సబ్ రిజిస్ట్రార్లు ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు చేసిన ఆస్తుల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని సమాచారం. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 కార్యాలయాల్లోని అటెండర్ నుంచి జిల్లా రిజిస్ట్రార్ వరకు బదిలీ అయిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో నూతన సిబ్బంది బాధ్యతలు చేపట్టారు.



హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

మ్యుటేషన్ సర్టిఫికెట్లలో..

రిజిస్ట్రేషన్ జరిగాక డాక్యుమెంట్ స్కాన్ చేశాక మ్యుటేషన్ సర్టిఫికెట్ సబ్ రిజిస్ట్రార్ సంతకంతో జారీ చేస్తారు. దీనికి రెండు రోజులు సమయం తీసుకుంటారు. కాగా, బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు రిలీవ్ అయ్యే రోజు వరకు రిజిస్ట్రేషన్‌లు చేశారు. దీంతో జారీకాని మ్యుటేషన్ సర్టిఫికెట్స్ 2500కు పైగానే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బదిలీ అయిన వారు చేసిన రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్స్‌పై తాము సంతకాలు పెట్ట మని నూతన సబ్ రిజిస్ట్రార్లు మొండికేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఇక తల్లిదం డ్రులు, వారి ఆస్తులను పిల్లలకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసే విషయంలో కొర్రీలు పెట్టి చేయడం లేదని సమాచారం. ఇళ్ల రిజిస్ట్రేషన్ విషయంలో లేనిపోని నిబంధనల పేరిట చేయడం లేదని తెలిసింది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు తగ్గినట్లు సమాచారం. హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతీ రోజు 100కు పైగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగుతుండేవి. మూడు రోజులుగా 50లోపే జరుగుతున్నట్లు అధికారికంగా తెలిసింది. నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసుకునే వారు సైతం ముందుకు రావడంలేదని సమాచారం. ప్రస్తుతం నెలకొన్న గందరగోళ వైఖరిపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సుభాషిణి సబ్ రిజిస్ట్రార్లతో భేటీ అయ్యి ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో స్పష్టత ఇవ్వకుంటే వరంగల్‌లో రియల్ దందా కుంటుపడే అవకాశాలున్నాయి. శాఖకు ఆదాయం తగ్గే అవకాశం ఉంది.

భార్యకు గుడికట్టి, విగ్రహం పెట్టిన భర్త



కొత్తగూడ, ఆగస్టు 8 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామంలో భార్యకు భర్త గుడికట్టి విగ్రహం పెట్టిన సంఘటన చోటు చేసుకుంది. కొత్తగూడ మండలంలోని ఓటాయికు చెందిన కుడికాల రమేష్ భార్య సరస్వతి సంవత్సరం క్రితం మృతి చెందింది. ఆమె జ్ఞాపకార్థం భర్త రమేష్ తన భార్య పోలీకలతో విగ్రహం చేయించాడు. తన కుమారులు ప్రశాంత్, రోహిత్‌తో కలిసి రమేష్ తన భార్యకు కట్టిన గుడిని, విగ్రహన్ని గురువారం ఆవిష్కరించారు.

గుండెపోటుతో వృద్ధురాలి మృతి

ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఘటన ● మృతురాలు వరంగల్ జిల్లా వాసి



మామిండ్ల గౌరమ్మ



తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 8 : గుండెపోటుతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన మామిండ్ల గౌరమ్మ (70) అనే వృద్ధురాలు తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఉదయం తొర్రూరు ఆస్పత్రికి చికిత్స కోసం కూతురు కొమురమ్మతో కలిసి రాయపర్తి వరకు ఆటోలో వచ్చింది. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో తొర్రూరుకు వస్తుండగా మార్గమధ్యలో ఛాతివద్ద నొప్పి రావడంతో ప్రయాణికులు కొం దరు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో బస్సు తొర్రూరు బస్టాండుకు చేరుకోగానే అంబులెన్స్‌లో గౌరమ్మను తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. కాగా, మృతురాలి భర్త గతంలో మరణించగా, ఆమె ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. తన చేతులమీదే తల్లి మృతి చెందడంతో కుమార్తె విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికుల సమ్మె


బచ్చన్నపేటలో దీక్షలో కూర్చున్న గ్రామ పంచాయతీ కార్మికులు


నర్మెటలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట కూర్చున్న గ్రామ పంచాయతీ కార్మికులు


లింగాలఘణపురంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట కూర్చున్న కార్మికులు

బచ్చన్నపేట, ఆగస్టు 8: గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని జీపీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు టీ మురళి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ముందు పలు గ్రామాల నుంచి వచ్చిన సిబ్బంది ఒకరోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి కనీస వేతనాలు చెల్లించాలన్నారు. పీఆర్సీ పరిధిలోకి జీపీ సిబ్బందిని తీసుకురావాలని, జీవో 60 ప్రకారం వేతనాలి వ్వాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని జీవో నంబర్ 51ని సవరించాలన్నారు. వివిధ గ్రామాల జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

● నర్మెట : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జీపీ కార్మికులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు. జీవో నెం 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పంచాయతీ కార్మికులు రాంచంద్రం, కృష్ణమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జనగామ మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్షుడు చెల్లోజు మల్లాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు చేస్తున్న నిరసనకు బీఆర్‌యస్ నాయకుడు, తాజా మాజీ ఎంపీపీ కళింగరాజు మద్దతూ తెలిపారు. ఈ సందర్భంగా కళింగరాజు, మల్లాచారిలు మాట్లా డారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామ ని హెచ్చరించారు. పగిడిపల్లి మల్లేశ్, సుదర్శన్, బాల నర్సయ్య, శ్రీశైలం, వినయ్, వరప్రసాద్, రమేష్, లక్ష్మి, వెంకటమ్మ, సులోచన పాల్గొన్నారు.

● దేవరుప్పుల : తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో ఒక రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రు, ప్రతినిధులు ఎడెల్లి వెంకట్‌రెడ్డి, గొడిశాల సోమయ్య, భానోతు సైదులు, గనగాని ఉప్పలయ్య, దయాకర్ పాల్గొన్నారు.

●లింగాలఘణపురం : గ్రామపంచాయితీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తెలంగాణ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు లింగాలఘణపురం మండల పరిషత్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు తిప్పారపు యాకూబ్ మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఇట్టబోయిన మహేందర్, కార్యదర్శి దరిపెల్లి పాండురంగ, యాదగిరి, మహేందర్, నర్సింహులు, సునీల్, అనిల్, నర్సయ్య, సత్తయ్య, గండి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని గురువారం ఎంపీడీవో కార్యాలయం ముందు ఒకరోజు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో వెంకన్న, శ్రీనివాసాచారి, ఉపేందర్, లక్ష్మయ్య, ధర్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్లలో సమ్మెలో కూర్చున్న జీపీ సిబ్బంది

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


బాలయేసు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య

దేవరుప్పుల, ఆగస్టు 8: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. గురువారం దేవరుప్పులలోని బాలయేసు హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, సిగిరేట్, గుట్కా, ఖైనీ, కొకైన్ వంటి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, ఏఎస్సై సదా నందం, సిబ్బంది, బాలయేసు కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ పాల్గొన్నారు.

డీఐఈవోగా జితేందర్‌రెడ్డి


డీఐఈవో జితేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు

జనగామ కల్చరల్, ఆగస్టు 8: జనగామ డీఐఈవోగా కల్లూరి జితేందర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాళ్ల సాధారణ బదిలీల్లో భాగంగా జితేందర్‌రెడ్డి దేవరుప్పుల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల నియమితులయ్యారు. కాగా సీనియర్ మోస్ట్ ప్రిన్సిపాల్ డీఐఈవోగా పనిచేయాలనే నిబంధన మేరకు ఆయన ఈ బాధ్యతలు స్వీకరిం చారు. ఇంతవరకు డీఐఈవోగా బాధ్యతలు నిర్వహించిన శాగంటి శ్రీనివాస్ తిరిగి తన యథాస్థానమైన కొడకండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఐఈవోను ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూటిగంటి రమేష్, ఎర్రం హన్మంతరావు, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి


రాఘవపూర్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో శ్రీపాద మధుసూదన్

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 8: ఆరోగ్యకరమైన సమాజ స్థాపనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఇంచార్జి ఎంపీడీవో శ్రీపాద మధుసూధన్ కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని రాఘవపూర్, మీదికొండ గ్రామా ల్లో ఆయన పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేబట్టిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలల ఆవరణలో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. కొత్తపల్లి గ్రామంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ రామకృష్ణ, ఏపీవో ప్రేమయ్య, సెక్రటరీలు అనురాధ, అశోక్, నర్మద పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : సీజనల్ వ్యాధుల నివారణకు, పర్యావరణ,పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం చేపట్టాలని కోరుతు స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీ సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు నినాదాలు చేస్తు ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వీ రాంజనేయులు, డాక్టర్ జనార్ధన్, డాక్టర్ సంధ్య, ఈఓ సత్యనారాయణ, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

రఘునాథపల్లి, ఆగస్టు 8: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లారీలలో ఎర్రమట్టి తరలిస్తు గుట్టలను మాయం చేస్తున్న రియల్టర్లపై రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని అశ్వరావుపల్లి గ్రామ శివారులో ఉన్న గుట్టల నుండి లారీలలో అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని సీపీఎం నాయకులు గురువారం నిలిపివేశారు. ఈ సందర్భంగా పొదల నాగరాజు మాట్లాడారు. సంబం ధిత అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాగుల కొంరయ్య, మం ద బిక్షపతి, గోర్ల బుచ్చయ్య, దిలీప్, తూరుగొండ నవీన్ పాల్గొన్నారు.

జనగామ సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలి

నర్మెట, ఆగస్టు 8 : న్యాయవాదులపై అమానుషంగా ప్రవర్తించిన జనగామ సీఐ రఘుపతిరెడ్డిని, ఎస్సై తిరుపతిలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన లాయర్ దంపతులు గద్దల అమృతరావు, కవితలపై సీఐ, ఎస్సై దాడి చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకుడు కంతి చరణ్, లింగాల కనకస్వామి, గద్దం రవి, జంజాల ప్రతాప్, బొడికె లక్ష్మయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

దేవరుప్పుల, ఆగస్టు 8: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య పిలుపునిచ్చారు. స్వచ్ఛ ధనం- పచ్చధనం కార్యక్రమంలో భాగంగా గురువారం దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థలం ఉన్న చోట మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చధనం కనిపించేలా చూడాలన్నారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, ఏఎస్సై సదానందం పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిలుపూర్, ఆగస్టు 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పెంపుడు కుక్కలకు వేస్తున్న ఏఆర్‌వీ (యాంటీ రాబీస్ వ్యాక్సిన్)వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మల్కాపూర్, చిన్నపెండ్యాల, చిలుపూర్ తదితర గ్రామాల్లో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి మాధవీలత, ఎంపీడీవో శంకర్, సెక్రటరీలు నవనీత, శశిధర్, ఎమ్డీ అజీజ్‌పాషా, బాహునాయక్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జఫర్‌గఢ్, ఆగస్టు 8 : వానాకాలంలో సంక్రమించే మలేరియా, డెంగీవంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కూనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజమౌళి విద్యార్థులకు సూచించారు. గురువారం మండలం లోని కూనూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. మండల విద్యా నోడల్ అధికారి ఎండి.పర్వేజ్, హెల్త్ సూపర్‌వైజర్లు చందర్, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 8: విద్యార్థులు తమ జీవితాలను అగమ్య గోచరంగా మార్చే ర్యాగింగ్, డ్రగ్స్ భూతానికి దూరంగా ఉండాలని సీఐ జి.వేణు పిలుపునిచ్చారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్ సంక్షేమ గురుకులంలో నిర్వహించిన ర్యాగింగ్, డ్రగ్స్ నివారణ అవగాహనా సమావే శంలో సీఐ మాట్లాడారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.కృతమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, పీడీ శ్రీనివాస్, పీఈటీ శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ అధికారులను నియమించాలి

జనగామ కల్చరల్, ఆగస్టు 8: రాష్ట్రంలో ఎంఈవో పోస్టుల భర్తీ కోర్టు పరిధిలో ఉన్నందున ప్రత్యామ్నాయంగా పర్యవేక్షణ అధికారులను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యద ర్శి చావా రవి డిమాండ్ చేశారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి చంద్రశేఖర్‌రావు అధ్యక్షత వహించగా చావా రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సీపీఎస్ ను రద్దు పరిచి ఓపీఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కృష్ణ, వెంకట్, వివిధ మండలాల బాధ్యులు ఆగయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఆక్రమించుకున్న 'డబుల్' ఇళ్లను ఖాళీ చేయాలి

దేవరుప్పుల, ఆగస్టు 8: ఆక్రమించుకున్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే ఖాళీ చేయండని జనగామ ఆర్డీఓ డి. కొమురయ్య అన్నారు. మండలకేంద్రంలోని కొత్తవాడలో గత ప్రభుత్వం నిర్మించిన 20డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను గ్రామానికి చెందిన దళితులు గత ప్రభుత్వ హయాంలో 8నెలలుగా ఆక్రమించుకుని నివాసముంటున్నారు. ఈనేపథ్యంలో వాటిని మంగళవారం ఆర్డీవో కొమురయ్య, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య వెళ్లి ఆక్రమితదారులతో మాట్లాడి ఇండ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామ సభలో ఎంపిక చేశాక డ్రా పద్ధతిన ఎవరికి వస్తే వారు అట్టి ఇండ్లల్లో ఉండాలన్నారు. మూడురోజుల్లో ఖాళీ చేయాలని, లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆర్డీఓ హెచ్చరించారు. దీంతో ఆర్డీఓతో ఆక్రమితదారులు మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అమెరికా వెళ్లిందని ఆమె తిరిగి వచ్చాక ఆమెతో మాట్లాడాక ఇండ్లు ఖాళీ చేస్తామని అధికారులకు తెలిపారు. దీంతో అధికారులు ఈనెల 26వరకు గడువిచ్చారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, ఆర్‌ఐలు రాజు, ఆంద్రయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెలకు మళ్లీ ఎన్ని'కళ'

(5వ పేజీ తరువాయి)

సంబంధించి జిల్లాల అవసరమయ్యే పోలింగ్ సిబ్బంది, గత ఎన్నికల్లో ఓటర్లు, ప్రస్తుత ఓటర్లు, గత ఎన్నికల సందర్భంగా వార్డులకు, సర్పంచి పదవి ఉన్న రిజర్వేషన్ ఏంటన్న అంశాలపై ఎన్నికల సంఘం కలెక్టర్ల నుంచి గత ఏడాది డిసెంబరులోనే నివేదిక కోరింది. దీంతో జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులను శాఖల వారీగా, పే స్కేల్ వారీగా వర్గీకరణ చేసి 'తెలం గాణ- పోల్(టీఈ-పోల్) వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఉద్యోగుల వివరాలతో పాటు 2009, 2014, 2019 పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, గ్రామాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను ఈనెల 30 లోగా 'పీపీఆర్ఎస్' మాడ్యూల్‌లో గత ఏడాది పొందుపరిచారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఎన్నికల నిర్వహణపై ఆదేశాలు ఇవ్వడంతో పంచాయతీ ఎన్నిక లు త్వరలోనే జరగనున్నాయనే ప్రచారం జరుగుతోంది. సెప్టెంబరు మొదటి వారంలో షెడ్యూల్ వచ్చి సెప్టెంబరు మూడో వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన


జనగామ కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ రూరల్, ఆగస్టు 7: న్యాయవాదుల దంపతులు అమృతరావు, కవితపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆరోపిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మూడో రోజు విధులు బహిష్కరించారు. కోర్టు ఎదుట టెంట్ వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చంద్ర ఋషి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడి చేసిన జనగామ సీఐ రఘుపతి రెడ్డి, ఎస్సై తిరుపతిలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని సస్పెండ్ చేసేంతవరకు తామ పోరాట ఆగదన్నారు. వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందో ళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎండీ సాదిక్ అలీ, నర్సింగరావు, బి. శంకర్, బడికె సందీప్, అశోక్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

రఘునాథపల్లి, ఆగస్టు 8: ప్రతీ ఉద్యోగికి బదిలీ సహజమని, విధి నిర్వహణలో అందించిన సేవలు అందరి హృదయాల్లో నిలిచిపోతాయని తాజా మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మినరేందర్ అన్నారు. మండలంలోని కోమల్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా 13ఏళ్ల పాటు సేవలందించిన టీ.సారయ్య బదిలీపై వెళ్తున్న సందర్భంగా పాఠశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సన్మాన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రఘునందన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జాన్ సుందర్ రావు, ఉపాధ్యాయులు సంతోష్ రెడ్డి, మాధవి, పుష్ప, అన్నపూర్ణ, సురేష్, కమలాకర్ పాల్గొన్నారు.

'షూటింగ్‌బాల్' మండలాధ్యక్షుడిగా మారపల్లి ప్రసాద్



స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 8: షూటింగ్‌బాల్ క్రీడా కమిటీ మండలాధ్యక్షుడిగా డివిజన్ కేంద్రానికి చెందిన మారపల్లి ప్రసాద్ ఎంపికయ్యారు. గురువారం డివిజన్ కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండల కమిటీని ఎన్ను కున్నారు. ప్రధాన కార్యదర్శిగా నర్సింగోజు చందర్, ఉపాధ్య క్షులు గా ఒగ్గు రాజు, కడారి క్రాంతి, కో సెక్రటరీగా చింతకింది సుధా కర్, ఎమ్డీ సఫీర్, కోశాధికారిగా బూర్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా రాజారపు మహేందర్, ఎదునూరి రాజు, అకారపు అశోక్‌లు ఎంపికయ్యారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు యుగేంధర్‌రెడ్డి, చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

జనగామ కల్చరల్, ఆగస్టు 8: విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజేశ్‌కుమార్ అన్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో డ్రగ్ అడిక్షన్, సైబర్ క్రైమ్, ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ యువతలో డ్రగ్స్, ఆల్కహాల్ వినియోగం, ట్రాఫిక్ మరణాలు, హింస, ఆత్మహత్య, విద్యా వైఫల్యం మొదలగు అధిక ప్రమాదకర ప్రవర్తనలకు కారణభూ తమవుతుందన్నారు. సాంకేతికత అభివృద్ది చెందుతున్న కొద్దీ సైబర్ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా వసంత


వసంత

పాలకుర్తి, ఆగస్టు 8 : జనగామ జిల్లా డీఆర్‌డీవో పీడీ ఎన్. వసంత మండల ప్రత్యేక అదికారిగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించిన మొగులప్ప నారాయణపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వచ్చిన వసంత మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

వసతిగృహాల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఆగస్టు 8: జిల్లా లోని బీసీ వసతి గృహాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధి లోని 10 పాఠశాల వసతి గృహాలు, 6 కళాశాల వసతి గృహాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో బీసీ హాస్టల్స్ డాట్ సీజీజీ డాట్ గవ్ డాట్ ఇన్ ద్వారా ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మైనారిటీ కళాశాలలో ప్రవేశాలకు గడువు పెంపు

జనగామ కల్చరల్, ఆగస్టు 8: మైనారిటీ గురుకుల కళాశాలలో ప్రవేశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను గడువును ఈ నెల 16కు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి రవిందర్ పాల్గొన్నారు. జనగామ లోని మైనారిటీ బాలుర పాఠశాలలో 5వ తరగతికి, 6,7,8 తరగతులలో మిగిలిపోయిన సీట్లకు, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మైనారిటీ బాలికల పాఠశాలలో 5వ తరగతి, 6,7,8 తరగతులలో మిగిలిపోయిన మైనారిటీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ కల్చరల్, ఆగస్టు 8: కరెన్సీ నోట్ల పై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కోరుతూ కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జే.పరశురామ్ గురువారం రాజ్యసభ సభ్యులకు వినతిపత్రం అందించారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని కోరుతూ ఈ నెల 29, 30, 31 తేదీలలో న్యూఢిల్లీ లోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాకు మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యులు దినేష్ శర్మ, భారత్ జోడో జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ యోగేందర్ యాదవ్, ఓబీసీ పార్లమెంటు ఫ్లోర్ లీడర్ బీద మస్తాన్‌రావు, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి వినతిపత్రాలు అందజేశారు. న్యాయమైన డిమాండ్ సాధన కోసం సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు పరశురామ్ పేర్కొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

జనగామ కల్చరల్, ఆగస్టు 8: కేరళలో ప్రకృతి విలయం వల్ల సర్వస్వం కోల్పోయిన వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. గురువారం సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డు, పాతబీటు బజారు ప్రాంతంలో సీపీఎం కార్యకర్తలు విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పొత్కనూరి ఉపేందర్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పందిళ్ల కళ్యాణి, పల్లెర్ల లలిత, చిలువేరు ఉపేందర్, కచ్చగళ్ల వెంకటేష్‌పాల్గొన్నారు.

దోమల వృద్ధిని నిరోధించాలి

బచ్చన్నపేట, ఆగస్టు 8 : గ్రామాల్లో దోమల ఉధృతిని నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మండల స్పెషల్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఎంపీడీవో మల్లిఖార్జున్‌లు పంచాయతీ కార్యదర్శులను కోరారు. స్వచ్ఛ దనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం గ్రామాలలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గుర్తించి సమావేశాలు నిర్వహించారు. కుక్కల నివారణకు ఎలా ముందుకు సాగాలో పలు జీపీలలో చర్చించారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

బచ్చన్నపేట, ఆగస్టు 8: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాలని సీఐ సాయిరమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఎస్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం, హరితోత్సవం సందర్భంగా ఎస్ఐ సతీష్, యువకులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన మొక్కలను కాపాడుకోవాలన్నారు. యువతీ యువకులు మొక్కలు నాటే కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనా లన్నారు. పడమటికేశ్వాపూర్ సర్పంచ్ గిద్దెల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భట్టాచార్య మరణం తీరని లోటు :సీపీఎం

జనగామ కల్చరల్, ఆగస్టు 8: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీపీఎం సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూడిద గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పాల్గొని మాట్లాడుతూ బుద్దదేవ్ భట్టాచార్య మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, పొత్కనూరి ఉపేందర్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పందిళ్ల కళ్యాణి, పల్లెర్ల లలిత, ఎండి.షైబెల్లి, రజిత, సౌందర్య, శ్రీలత, కనకయ్య పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా మండలాధ్యక్షురాలిగా ప్రణీత

చిలుపూర్, ఆగస్టు 8 : బీజేపీ అనుబంధ మహిళా మోర్చా మండలాధ్యక్షురాలిగా, మండలంలోని వంగాలపల్లి మాజీ సర్పంచ్ ఆరూరి ప్రణీత -ప్రభుదాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి గురువారం నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రణీత మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మహిళా మోర్చా మండలాధ్యక్షురాలిగా నియమిం చినందుకు దశమంతరెడ్డితో పాటు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల పండ్ల పంపిణీ

కొడకండ్ల ఆగస్టు 8 : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎ.ఝాన్సీరెడ్డి వివాహ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని అమెరికాలో ఉన్న ఝాన్సీరెడ్డి - రాజేందర్‌రెడ్డి దంపతులకు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్, పండ్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అందె శ్రీవర్ణ, ధర్మారం భిక్షపతి, మసురం రవీందర్, అబ్దుల్లా, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, రాజేష్ , సోమనర్సయ్య, పి.మధుసూదన్ పాల్గొనారు.

గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి

బచ్చన్నపేట, ఆగస్టు 8: గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలం నుంచి సీపీఎం బృందం వెల్దండ, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం రిజర్వాయర్లను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మినలాపురం ఎల్లయ్య ఎడబోయిన రవీందర్‌రెడ్డి, బైరగోని బలరాములు, నాంపల్లి సిద్దులు, మేడోజు బాలాచారి, పతంగి రామయ్య పాల్గొన్నారు.